@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || శుక్రవారం 24, మే 2024 || పేజీలు: 04



# బుద్ధుడి బోధనలే స్ఫూర్తి.. వాటిని ఆచరిస్తున్నా..

- 2,500 ఏళ్ల తర్వాత కూడా ఆదర్శంగా బౌద్ధం
- నేటి విద్వేష వాతావరణంలో ఎంతో అవసరం
- ప్రపంచ స్థాయి కార్యక్రమం ఏర్పాటుచేయండి
- వ్యక్తిగా, ముఖ్యమంత్రిగా సహకారం అందిస్తా
- బుద్ధ పౌర్ణమి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

మారేడుపల్లి, నాగార్జునసాగర్, మే 23:


గౌతమ బుద్ధుడు చేసిన బోధనల్లో 'ధ్యానాన్ని ఒక పనిగా చేయడం కాదు.. ప్రతీ పనిని ధ్యానంగా చేయాలి' అనే బోధన తనకు ఎంతో ఇష్టమైనదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇది పైకి రెండు లైన్లుగా కనిపిస్తుందిగానీ, అర్థం చేసుకుంటే ప్రపంచ పరిజ్ఞానమంతా అందులో ఉందన్నారు. ఈ బోధన నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని, పని చేసేటప్పుడు పూర్తిస్థాయిలో కాకపోయినా, కొంత మేరకైనా ధ్యానంగానే పని చేస్తానని తెలిపారు. గౌతమ బుద్ధుడు బోధించిన శాంతి, సహనం, అనురాగం, ప్రేమ, ఐకమత్యం అనే భావనలను తాను పూర్తిగా విశ్వసిస్తూ జీవితంలో ఆచరిస్తున్నానని సీఎం వెల్లడించారు. సికింద్రాబాద్‌లోని మహేంద్రహిల్స్‌లో ఉన్న మహాబోధి బుద్ధవిహార్‌లో గురువారం జరిగిన బుద్ధ పౌర్ణమి (బుద్ధుడి జన్మదిన) వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బుద్ధుడి బోధనలు అమూల్యమైన సందేశాన్ని కలిగి ఉంటాయన్నారు. రాజ్యం, అధికారం, కుటుంబం.. మిగతా 2లో..

# మేడిగడ్డ వద్ద మళ్లీ శబ్దాలు

## 7వ బ్లాకులో గేట్లు ఎత్తుతుండగా ప్రకంపనలు

### బ్యారేజీ కింద భారీగా బొరియ ఏర్పడినట్టు అనుమానాలు

### పనులు కొనసాగిస్తే బ్యారేజీ మరింతగా కుంగిపోవచ్చనే అంచనాలు



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్:

కాళేశ్వరం బ్యారేజీలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద మళ్లీ ధ్వనులు, ప్రకంపనలు వచ్చాయి. కుంగిన ఏడో బ్లాకులోని 16వ నంబర్ గేటును పైకి ఎత్తడానికి నీటిపారుదల శాఖ ప్రయత్నించగా.. బ్యారేజీ కింద భూగర్భంలో నుంచి భారీగా శబ్దాలు, ప్రకంపనలు రావడంతో వెంటనే ఆ పనులను నిలిపేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సెన్సర్లు సైతం శబ్దాలు, ప్రకంపనలను గుర్తించి అలర్ట్ చేశాయి. దీంతో బ్యారేజీ పెను ప్రమాదానికి లోనయ్యే అవకాశం కనిపిస్తోందంటూ నీటిపారుదల శాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గతంలో వరదల సమయంలో బ్యారేజీ పునాదుల కింద నుంచి ఇసుక కొట్టుకుపోయి, మిగతా 2లో..



# ఛత్తీస్‌ఘడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి
- బస్తర్ రేంజ్‌లో ఇప్పటివరకు 112మంది మృతి

నేటి ఫోకస్ న్యూస్, కొత్తగూడెం/రాయ్‌పూర్-మే23:

దండకారణ్యం మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లింది. మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్-నారాయణపూర్ జిల్లాల సరిహద్దుల్లో గురువారం చోటు చేసుకుంది. నారాయణపూర్ ఎస్పీ ప్రభాత్‌కుమార్ మిగతా 2లో..

# జూన్ 5 తరవాత బీఆర్ఎస్ దుకాణం బంద్



- కార్యకర్తలే పార్టీ నేతలపై తిరగబడతారు
- రాష్ట్ర సంపదను దోచుకుని చిప్పచేతికి ఇచ్చారు
- కవితపై 8వేల పేజీల చార్జిషీట్‌కు సమాధానం చెప్పండి
- కెటిఆర్ నోరు అదుపులో పెటుకో..
- మంత్రి కోమటిరెడ్డి ఘాటు విమర్శలు

వివరాలు 02లో..

# బగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం 2



# బాండ్ పేపర్లు రాసిచ్చి.. ఇంత దగానా?



- వడ్లకు బోనస్ అడిగితే మొరుగుతున్నారంటారా
- జగిత్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన
- రైతులు హైదరాబాద్‌కు వచ్చి ధర్నా చేస్తారని హెచ్చరిక
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే హరీష్ రావు

నేటి ఫోకస్ న్యూస్, జగిత్యాల-మే23:

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సిద్దిపేట భారాస ఎమ్మెల్యే మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ధాన్యం విక్రయం కోసం నెలరోజులుగా పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో పర్యటించిన ఆయన.. పూడురులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. గత ప్రభుత్వం 67 లక్షల మెట్రిక్ టన్నుల మిగతా 2లో..



# వనపర్తిలో బీఆర్ఎస్ నేత దారుణ హత్య

## కల్లం వద్ద నిద్రిస్తుండగా నరికి చంపారు..

### రాజకీయ కక్షలే కారణం: కుటుంబం

### మంత్రి జూపల్లి, అనుచరుల ప్రమేయం: బీఆర్ఎస్

నేటి ఫోకస్ న్యూస్, వనపర్తి, మే 23:

వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో బొడ్డు శ్రీధర్‌రెడ్డి (52) అనే బీఆర్ఎస్ నాయకుడు దారుణ హత్యకు గురయ్యారు. బుధవారం అర్ధరాత్రి తన సొంత పొలంలోని కల్లం దొడ్డి వద్ద నిద్రిస్తున్న శ్రీధర్ రెడ్డిని దుండుగులు గొడ్డలితో నరికి చంపారు. ఈ హత్యకు రాజకీయ కక్షలే కారణమని మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, బీఆర్ఎస్ నేతలు మిగతా 2లో..



# మంత్రి కోమటిరెడ్డి జన్మదిన సందర్భంగా వికలాంగుల స్కూటీల పంపిణీ..



నల్లగొండ, (నేటి ఫోకస్‌న్యూస్)–మే 23: తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల మరియు సినిమాటోగ్రాఫీ శాఖ మాత్యులు గౌ" శ్రీ.కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఇద్దరు వికలాంగులకు జుపిటర్ ట్రై స్కూటీ లు టీ.పీ.సీ.సీ కార్యదర్శి కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రధాన అనుచరుడు పీసారి మహిపాల్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డి చేతుల మీదగా వారికీ అందచేయడం జరిగింది.

# ఛత్తీస్‌ఘడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి..)

వెల్లడించిన వివరాల ప్రకారం.. నారాయణ్‌పూర్ జిల్లా అబూజ్‌మడ్ పరిధిలోని ఓర్చా అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు పోలీస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో నారాయణ్‌పూర్–బీజాపూర్–దంతేవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, ఐటీబీపీ, బస్తర్ ఫైటర్స్ భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహించాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి భద్రతా దళాలపైకి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురు కాల్పులకు దిగాయి. సుమారు 60 మంది సాయుధ మావోయిస్టులు ఉన్నట్లు పసిగట్టిన జవాన్లు పరిసరాలను వ్యూహాత్మకంగా చుట్టుముట్టి దాడులు నిర్వహించారు. మావోయిస్టులు వారి ధాటికి తాళలేక కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గం మీదుగా పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసు కుని గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలం నుంచి ఏడుగురు మావో యిస్టుల మృతదేహాలతోపాటు ఏడు తుపాకులు, భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు, ఆయుధ, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన లో కొందరు మావోయిస్టులకు గాయాలైనట్లు ఎస్పీ వెల్లడించారు. వీరంతా మావోయిస్టు పార్టీ 5వ కంపెనీకి చెందిన నక్సలైట్లుగా గుర్తించారు. వీరిలో పెద్ద మొత్తంలో రివార్డు ఉన్న మావోయిస్టు నాయకులు ఉన్నారని, వారిని గుర్తించే పనిలో ఉన్నట్లు ఎస్పీ ప్రభాత్‌కుమార్ వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకు బస్తర్ రేంజ్ పరిధిలో సెర్చింగ్ ఆపరేషన్స్‌లో భాగంగా జరిగిన ఎదురుకాల్పుల్లో 112 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటనతో అబూజ్‌మడ్ ప్రాంతాన్ని భద్రతా బలగాలు పెద్ద ఎత్తున చుట్టుముట్టి గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

# వనపర్తిలో బీఆర్‌ఎస్ నేత దారుణ హత్య..

(మొదటి పేజీ తరువాయి..)

మృతదేహంతో ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు ప్రకారం.. శ్రీధర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో కీలక నాయకుడిగా, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా కొనసాగుతున్నారు. కాగా, కల్లం వద్ద మిర్చి నిల్వలు ఉండటంతో కొద్దిరోజులుగా ఆయన అక్కడే నిద్రిస్తున్నారు. బుధవారం రాత్రి కూడా అక్కడే నిద్రించారు. అయితే.. గురువారం ఉదయం కల్లం వద్దకు పాలు పితకడానికి వెళ్లిన శ్రీధర్‌రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డి.. తన కుమారుడు హత్యకు గురై విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే గ్రామస్థుల సాయంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. డాగ్‌స్క్వాడ్‌తో పరిసర ప్రాంతాలను తనిఖీ చేయగా, ఒక పాయింట్ వద్దకు వెళ్లి డాగ్‌స్క్వాడ్ తిరిగి వచ్చింది. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తన కుమారుడిపై హత్యకు కుట్ర చేశారని మృతుడి తండ్రి శేఖర్‌రెడ్డి ఆరోపించారు. పలుమార్లు తనకు మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కృష్ణప్రసాద్‌ల నుంచి ప్రాణహాని ఉందని చెప్పాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐపీసీ సెక్షన్ 302 కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వనపర్తి సీఐ నాగభూషణ్‌రావు తెలిపారు.

**భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీల వల్లే..**

బీఆర్‌ఎస్ నేతల ఆరోపణలను మంత్రి జూపల్లి కృష్ణారావు ఖండించారు. శ్రీధర్‌రెడ్డి హత్యకు దురలవాట్లు, భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలే కారణమన్నారు. వ్యక్తిగత కారణాల వల్ల జరిగిన హత్యను రాజకీయ హత్యగా కేటీఆర్, బీఆర్‌ఎస్ నాయకులు చిత్రీకరించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఏం జరిగిందో తెలుసుకోకుండానే తనపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్, కేటీఆర్ నీచరాజకీయాలు పరాకాష్ఠకు చేరుకున్నాయని, ఇకనైనా శవరాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. శ్రీధర్ రెడ్డి హత్యపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్నారని, విచారణలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.

**జూపల్లి బాధ్యత వహించాలి: కేటీఆర్**

శ్రీధర్‌రెడ్డి హత్య విషయం తెలుసుకొని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గ్రామానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ హత్యకు బాధ్యత వహించాలన్నారు. జూపల్లిని బర్తర ఫ్ చేసి జ్యుడీషియల్ లేదా ఎస్ఐబీ ద్వారా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని లేని ఫ్యాక్షన్ సంస్కృతిని కొల్లాపూర్‌లో జూపల్లి అమల్లోకి తెచ్చారని, 4 నెలల్లో ఇద్దరు బీఆర్‌ఎస్ నాయకులు హత్యకు గురయ్యారని అన్నారు. మంత్రిని బర్తరఫ్ చేసి సీఎం రేవంత్ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు.

# బుద్ధుడి బోధనలే స్ఫూర్తి.. వాటిని ఆచరిస్తున్నా

(మొదటి పేజీ తరువాయి..)

అన్నింటినీ 29 ఏళ్ల చిన్న వయసులో సిద్ధార్థుడు తృణప్రాయంగా వదిలేసి సమాజంలో శాంతి స్థాపన కోసం బయల్దేరాడని గుర్తు చేశారు. బిహార్‌లోని గయలో మొదలైన బౌద్ధం 2,500 ఏళ్ల తర్వాత కూడా ప్రపంచానికి నేటికీ ఆదర్శంగా నిలుస్తోందని, బౌద్ధం గొప్పతనం దీని ద్వారా తెలుస్తుందని సీఎం చెప్పారు.

ప్రస్తుతం మన దేశంలో, రాష్ట్రంలో భావోద్వేగాల ఆధారంగా మనుష్యుల మధ్య వైషమ్యాలను పెంచే పరిస్థితులు నెలకొన్నాయని ఇటువంటి సందర్భంలో బుద్ధుని సందేశం దేశానికి చాలా అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సమాజంలో పెరుగుతున్న అశాంతి, అసూయ వంటి ధోరణులను అధిగమించి సమాజానికి మేలు చేకూర్చే మంచి ఆలోచనలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు బుద్ధుడి బోధనలతో కూడిన పాఠశాలలను ఏర్పాటు చేయాలని సూచించారు. బుద్ధుడి సందేశాన్ని సమాజంలో ప్రతీ ఒక్కరికి చేరవేయడానికి తాను వ్యక్తిగతస్థాయిలోనూ, ప్రభుత్వ పరంగానూ అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని సీఎం హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బౌద్ధ బిక్షువులకు తగిన గౌరవం ఉంటుందని చెప్పారు. ప్రపంచ దేశాల్లోని బౌద్ధ బిక్షువులతో కలిసి రాష్ట్రంలో ఏదైనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తే సహకారం అందిస్తామని తెలిపారు. మహేంద్రహిల్స్ మహాబోధి బుద్ధవిహార్‌కు కావలసిన అభివృద్ధి పనులు, ధ్యానమందిరం నిర్మాణాలకు రూ.కోటి 30 లక్షలు అవుతుందని అంచనాలు వేశారని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆ ప్రతిపాదనను పరిశీలించి ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహాబోధి బుద్ధవిహార్‌కు రావటం ద్వారా గొప్ప క్షేత్రాన్ని సందర్శించిన అనుభూతి కలిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బౌద్ధ సాధువులను, భిక్షువులను సీఎం సత్కరించారు. అష్టాంగమార్గం అనే పుస్తకాన్ని విష్కరించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ప్రముఖులు ఆంజనేయరెడ్డి, రావుల ఆంజయ్య భిక్ష గురూజీలతోపాటు అడిషనల్ డీజీపీ శివధర్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, శ్రీగణేశ్ తదితరులు పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 2568 బుద్ధ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ఎండీ రమేషనాయుడు మాట్లాడుతూ, గౌతమ బుద్ధుని బోధనలు ప్రపంచానికి ఆదర్శనీయమని కొనియాడారు. డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి రచించిన బుద్ధుని మొదటి ప్రవచనం, బుద్ధుని చివరి రోజులు అనే పుస్తకాలను రమేషనాయుడు ఆవిష్కరించారు.

# మేడిగడ్డ వద్ద మళ్లీ శబ్దాలు

(మొదటి పేజీ తరువాయి..)

12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల పరిమాణంలో భారీ బొరియ ఏర్పడి ఉండవచ్చని ఇప్పటికే నిర్వహించిన జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షల ద్వారా ఓ అంచనాకు వచ్చినట్టు నీటిపారుదల శాఖ వర్గాలు చెప్తున్నాయి. టన్నుల కొద్దీ బరువుండే గేటును పైకి ఎత్తే క్రమంలో పునాదులపై ఒత్తిడి పెరుగుతుందని.. పునాదుల కింద భూగర్భంలో బొరియ ఉండటంతో ఆ ఒత్తిడికి బ్యారేజీ మరింత కుంగిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గ్రౌటింగ్ ద్వారా భూగర్భంలోని ఖాళీలను పూడ్చివేశాకే గేట్లను పైకెత్తే పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. నిజానికి 7వ బ్లాకు కుంగిన తర్వాత అక్కడి నుంచి నీటి లీకేజీని ఆపడానికి.. ఏకంగా 40వేల ఇసుక బస్తాలు వేశారు. అయినా బ్యారేజీ కింద భారీగా ఖాళీ ఉందని అంచనాకు రావడం గమనార్హం. మేడిగడ్డ బ్యారేజీలో మొత్తం 8 బ్లాకులు, 85 గేట్లు ఉండగా.. గతేడాది అక్టోబర్ 21న ఏడో బ్లాకు కుంగిన వెంటనే 77 గేట్లను ఎత్తి నీటిని వదిలేశారు. 7వ బ్లాకులోని 15 నుంచి 22 నంబర్ వరకు గేట్లు మొరాయించాయి. కాళేశ్వరం బ్యారేజీల్లోని లోపాలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ.. బ్యారేజీలను పలుమార్లు పరిశీలించి ఇటీవల మధ్యంతర నివేదిక సమర్పించింది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం 2019 జూలైలో పూర్తవగా.. అదే ఏడాది వచ్చిన వరదల సమయంలో బ్యారేజీ ప్రమాద సంకేతాలను వెలువరించిందని పేర్కొంది. బ్యారేజీలకు వానాకాలంలోగా నిర్వహించాల్సిన అత్యవసర మరమ్మతులు, చర్యలను సిఫారసు చేసింది. అయితే వానాకాలానికి ముందే మేడిగడ్డ బ్యారేజీలో మొరాయించిన గేట్లను పైకి ఎత్తేయాలని సూచించింది. అందులోనూ పగుళ్లు వచ్చిన 19, 20, 21 పియర్ల మధ్య ఉన్న గేట్లను అత్యంత జాగ్రత్తగా పైకి ఎత్తాలని స్పష్టం చేసింది. నీటి పారుదల శాఖ అధికారులు నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ సిబ్బందితో కలసి ఈ నెల 17న 15వ నంబర్ గేటును విజయవంతంగా పైకి ఎత్తారు. తర్వాత 16వ నంబర్ గేటును ఎత్తడానికి ప్రయత్నించగా.. శబ్దాలు, ప్రకంపనలు వచ్చినట్టు అధికారవర్గాలు తెలిపాయి.

# బగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్–మే23:

పశ్చిమ మధ్య, దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుందని, శనివారం నాటికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 25న తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుఫానుగా మారే అవకాశాలు ఉన్నాయని.. 26 నాటికి పశ్చిమ బెంగాల్ తీరానికి తుఫాను చేరుతుందని పేర్కొంది. బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్నాయి. దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు విస్తరించాయి. ఈ క్రమంలో తెలంగాణలో రాగల రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, సిద్ధిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, హన్మకొండ, జనగామ, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశాలున్నాయని పేర్కొంది.

# బాండ్ పేపర్లు రాసిచ్చి.. ఇంత దగానా?

(మొదటి పేజీ తరువాయి..)



ధాన్యం కొనుగోలు చేసింది. ప్రస్తుతం 37 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారు. రైతులంతా హైదరాబాద్‌కు వచ్చి ఉద్యమం చేస్తామంటున్నారని పేర్కొన్నారు. వడ్లకు బోనస్ ఏమైందని అడిగితే.. వ్యవసాయ మంత్రి కొందరు మొరుగుతున్నారంటూ రైతులను కుక్కలతో పోలుస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు బాండ్ పేపర్‌పై రాసిచ్చి.. వడ్లకు బోనస్ ఇస్తామని ఇవాళ సన్నాలకు మాత్రమే ఇస్తామని ఇవాళ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని అన్నారు. ఆరోజు మీరు రాసిచ్చిన బాండ్ పేపర్‌పై సంతకాలు పెట్టారు కదా? మీరు సంతకాలు పెట్టి.. నమ్మబలికి బాండ్ పేపర్లు ఇచ్చి.. చేతుల్లో పట్టుకొని ఇవాళ వడ్లకు బోనస్ ఏమందంటే చేతులెత్తేస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ జగిత్యాల జిల్లాలో రైతులతో, వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడితే జిల్లా పరిధిలో 2.97లక్షల ఎకరాల్లో యాసంగిలో వడ్ల పండితే.. 2.80లక్షల ఎకరాల్లో దొడ్డు వడ్లే ఉన్నయ్. మిగితా 17వేల ఎకరాల్లో సన్నాలు సాగు చేశారు. అవి కూడా ఇంటిమందం సన్నాలు తిండిగింజల కోసం సాగు చేశారు. దానికి మీరు బోనస్ ఇచ్చేది ఏందీ? లక్ష్మారెడ్డి అనే రైతుతో మాట్లాడితే మా జగిత్యాలలో జైశ్రీరామ్ అనే సన్నవడ్లకు బయట రూ.2800– రూ.3వేలు కొనుగోలు చేస్తున్నరు. గవర్నమెంట్ ఇచ్చేది ఏందీ? ప్రైవేటులోనే కొనుగోలు చేస్తున్నారు. అందువల్ల రూ.500 కోసం ప్రభుత్వానికి అమ్మనే అమ్మరు. ఇదంతా మోసం ఉన్నది అని రైతు లక్ష్మారెడ్డి చెబుతూ వాపోతున్నరు. వాస్తవానికి దొడ్డు రకమైతే 25–30 క్వింటాళ్లు పండుతయ్. సన్న రకాలైతే 10–15 క్వింటాళ్లు పండుతయ్. దాదాపు పది క్వింటాళ్ల వరకు దిగుబడి తక్కువ. రోగాలు, పెట్టుబడి, నెలరోజుల కాలం ఎక్కువ. మన ప్రాంతంలో రైతులు పండించేది రూపాయికి 90 పైసలు దొడ్డు రకమే ఎక్కువ. మరి సన్నాలకు బోనస్ ఇస్తామంటే.. రైతులను మోసం చేయడం, దగా చేయడం.. రైతులను గుండెలపై తన్నడం తప్ప ఇంకోటి లేదు' అన్నారు. ఈ రైతులే చెబుతున్నరు ఈ కాంగ్రెస్ గవర్నమెంట్ మమ్మల్ని మోసం చేస్తున్నది. అంటే ఇవాళ రైతులను అవమానపరుస్తున్నారని అంటూ నిలదీశారు. రైతులందరూ ముక్తకంఠంతో చెబుతున్నరు. మేమందరం హైదరాబాద్‌కు వస్తాం. పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని చెబుతున్నరు. దీనిపై స్పందించాలని అన్నారు. మొన్న లోక్‌సభ ఎన్నికల సమయంలో డబ్బాలో ఓటుపడేదాక ఏమీ మాట్లాడలేదు. ఇప్పుడు సన్నాలకే బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రైతులను మోసం చేస్తున్నరు. మంత్రులు మేల్కొనాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలావుంటే వనపర్తిలో భారాస నేత శ్రీధర్ హత్య ఘటనను హరీశ్‌రావు ఈ సందర్భంగా ఖండించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే దాడులు పెరిగాయని ఆరోపించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోనే ఇద్దరు భారాస నేతలు హత్యకు గురయ్యారని మండిపడ్డారు. ప్రశ్నించే గొంతుకలను కాంగ్రెస్ ప్రభుత్వం భయపెట్టలేదని స్పష్టం చేశారు. భారాస శ్రేణులు ధైర్యం కోల్పోవద్దని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

# జూన్ 5 తరవాత బీఆర్ఎస్ దుకాణం బంద్..

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్–మే23:

ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జూన్ 5 తర్వాత భారాస దుకాణం మూతపడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం భారాస నేతలను ఆ పార్టీ కార్యకర్తలే వెంటపడి కొడతారన్నారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సంపదనంతా దోచుకున్నది చాలక కేసీఆర్ కుటుంబం దిల్లీకి వెళ్లింది. అవినీతి చేయకుండానే భారాస ఎమ్మెల్సీ కవితపై 8 వేల పేజీల ఛార్జిషీట్ దాఖలు చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పుల ఖజానా మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు. ఇకపోతే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకోవాలంటూ కేటీఆర్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరోసారి తమ ముఖ్యమంత్రి రేవంత్‌ని తిడితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. కేటీఆర్ బచ్చా అని.. తండ్రి పేరు చెప్పుకుని మంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. కానీ, రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్‌గా గెలిచి లీడర్ అయ్యారని పేర్కొన్నారు. రేవంత్ వయసులో పోలిస్తే కేటీఆర్ చిన్న పిల్లాడు అని వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో కేకే మహేందర్ రెడ్డి పొట్ట కొట్టి కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యాడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల రిజల్ట్స్ తరువాత బీఆర్‌ఎస్ భూస్థాపితం అవడం ఖాయం అని అన్నారు. మేడిగడ్డ మాదిరిగానే బీఆర్‌ఎస్ పార్టీ కూలిపోవడం ఖాయం అన్నారు. కేసీఆర్ కూతురు కవిత చేసిన పనికి రాష్ట్రం పరువు పోతోందని వ్యాఖ్యానించారు. 5వ తేదీ నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలే కేటీఆర్, హరీష్ రావునితరిమి కొడుతారని అన్నారు. నందినగర్ నుండి కారులో న్యూట్రల్‌లో వెళ్లినా అసెంబ్లీకి చేరుకోవచ్చునని.. కట్టే పట్టుకొని అసెంబ్లీకి రాలేదు కానీ, బీజేపీ కోసం కెసిఆర్ బస్సులో తిరిగారని కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. అసలు తెలంగాణ కోసం కొట్లాడింది తామేనని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీకి రెండు మూడు స్థానాల్లో డిపాజిట్ వస్తుందని.. అన్ని స్థానాల్లో ఓడిపోతుందని మంత్రి కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. 12 రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీ లేకుండా పోతుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి లీడర్, క్యాడర్ లేకుండా పోతారని అన్నారు. 5వ తేది తర్వాత తెలంగాణ భవన్‌కి తాళం వేసుకోవాల్సి వస్తుందన్నారు. కవితకు బెయిల్ రావట్లేదని కేటీఆర్ పూర్తిగా ఫ్రస్టేషన్‌లోకి వెళ్లారని.. అందుకే ఇష్టారీతిన తమ ప్రభుత్వంపై కారుకూతలు కూస్తున్నారంటూ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ఇస్తున్నందుకు మా రేవంత్‌ని తిడుతున్నావా? 500రూపాయలకు సిలిండర్, ఉచిత విద్యుత్ ఇవ్వడమే మేం చేస్తున్న పాపమా? హాస్టల్స్, పేదవారికి ఇచ్చే ఉచిత బియ్యం పూర్తిగా సన్నబియ్యం ఇద్దామనుకోవడం తప్పా? మేం ఇచ్చిన నోటిఫికేషన్ కాంగ్రెస్ క్లెయిమ్ చేసుకుంటుంది అంటున్నావ్. మరి మీరే ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. మా ముందు చూపుతోనే హైదరాబాద్ అభివృద్ధి జరిగింది. కేసీఆర్ చేసిన పనికి మూడు డ్యాములు కొట్టుకొని పోయే ప్రమాదం ఉందని నిపుణులు చెప్తున్నారు. కాళేశ్వరం పేరుతో కోట్ల రూపాయలు వృధా చేశారు. వైన్ షాపుల పేరు మీద కేసీఆర్ నాన్ రిఫండబుల్ పైసలు గుంజిండు. ఏకకాలంలో రుణమాఫీ చేయబోతున్నాం. మల్లన్నపై కేసులు ఉన్నాయని అంటున్నావ్.. మీ చెల్లిపై 8000 పేజీల ఛార్జ షీట్ పై ఏమంటావ్ కేటీఆర్? మహేశ్వర్ రెడ్డి ఏం పైరవీ చేసుకొని పదవి తెచ్చుకున్నారు? ఆయన పేరు పలకాలంటే సిగ్గుగా ఉంది?' అని కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. తెలంగాణ బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఈ డిపార్ట్‌మెంట్‌కి వెళ్లినా మహేశ్వర్ రెడ్డి ఆర్టీఐ అప్లికేషన్లే ఉంటున్నాయని అన్నారు. బ్లాక్ మెయిల్ చేసి పైసలు సంపాదించాలని మహేశ్వర్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు.

# రాష్ట్ర వ్యాప్తంగా సజావుగా ధాన్యం కొనుగోళ్లు

- చిన్నిచిన్న పొరపాట్లను పెద్దవిగా చూడరాదు
- 7,172 సెంటర్లలో 39.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్–మే23:

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరుగుతున్నాయని పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ పేర్కొన్నారు. అయితే పెద్ద సంఖ్యలో కొనుగోళ్లు జరిగినప్పుడు చిన్న చిన్న లోపాలు జరగడం సహజమన్నారు. ధాన్యం కొనుగోళ్లపై చౌహాన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కావొస్తోందన్నారు. ధాన్యం కొన్న తర్వాత రైతులకు డబ్బులు పడ్డాయా లేదా అనేది ప్రతీ సెంటర్ నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నాం. 7,172 సెంటర్‌లలో 39.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. తెలంగాణ బియ్యానికి మంచి బ్రాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ధాన్యం తరుగు అనేది అవాస్తవం.. కొనుగోలు కేంద్రాల వద్ద క్లీనింగ్ మిషన్లు పెట్టాము. క్లీనింగ్ ఉన్న ధాన్యంలో ఒక్క కిలో కూడా కటింగ్ లేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే ధాన్యం క్లీన్‌గా ఉండాలని ఆదేశాలున్నాయి. ధాన్యంలో మట్టి, చిన్న రాళ్ళు, డస్ట్ ఉంటే సమస్య వస్తుంది. బకాయిలు ఉన్న మిల్లర్లకు ధాన్యం ఇవ్వలేదు. మిల్లర్ల వద్ద కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. అందుకే వాళ్లకు ధాన్యం ఇవ్వలేదు. నీతినిజాయితీగా పని చేస్తున్నాం. మిల్లర్ల వద్ద డబ్బులు అధికారులు డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు చేయడం సరికాదు. ఆధారాలుంటే నిరూపించాలన్నారు. మాపై అసత్య ఆరోపణలు చేయడం వల్ల మాకే కాదు రైతులకు కూడా ఇబ్బంది అవుతుంది.

# ఘనంగా గౌతమ బుద్ధ జయంతి

- బుద్ధ విహార్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది
- మహీంద్రా హిల్స్ బుద్ధ భవనంలో జరిగిన వేడుకలకు రేవంత్ రెడ్డి హాజరయ్యారు
- మహీంద్రా హిల్స్ లో బుద్ధ విహార్ ఉండడం మన అదృష్టం
- గౌతమ బుద్ధుని శాంతి సహనం మనందరికీ ఆదర్శం





**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ :**

శాంతి సహనం అనురాగం ప్రేమ ఐకమత్యం అనే భావనలు గౌతమ బుద్ధుడు బోధించిన వాటిని తాను పూర్తిగా విశ్వసిస్తూ, నా జీవితంలో ఆచరిస్తూ ఉంటానని నాతో పాటు దేశ ప్రజలకు కూడా ఎంతో అమూల్యమైన సందేశాన్ని భవిష్యత్తును సూచించే వాటి లాగా ఉంటాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మహేంద్ర హిల్స్ లో ఉన్న మహాబోధి బుద్ధ విహార్ లో జరిగిన బుద్ధుని 2568వ జయంతి వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచ దేశాల్లో నేడు ఓపిక సహనం క్షమ లోపించాయని, వాటి స్థానంలో ద్వేషాలు విద్వేషాలు సమాజంలో జీవించలేని పరిస్థితులు ఉన్నాయని, అలాంటి బుద్ధుని ధర్మ సూక్తులు ప్రవచనాలు ప్రపంచ దేశాలకు దిక్సూచిగా ఉన్నాయని దిక్సూచిగా ఉన్నాయని సూచించిన ధర్మ సూక్తులు ప్రవచనాలు ప్రపంచ దేశాలకు ఎంతో మంచి భవిష్యత్తును ఇచ్చే దిక్సూచి లాగా ఉన్నాయని వాటిని ఆచరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ఈ బుద్ధిమ విహార్ కావలసిన అభివృద్ధి పనులు ధ్యాన మందిరం నిర్మాణాలకు కోటి 30 లక్షలు అవుతుందని అంచనాలు వేశారని వాటికి ఎలక్షన్ కోడ్ అయిన తర్వాత ఆ ప్రపోజల్ పరిశీలించి మంజూరు చేస్తామని తెలంగాణ ప్రభుత్వం తరఫున సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సాధువులను భిక్షువులను సీఎం సత్కరించారు. ముఖ్యంగా ఈ వేడుకలు పౌర్ణమి సందర్భంగా ప్రారంభము కాగా భక్తులు పాల్గొని ప్రవచనాలు విన్నారు ముఖ్యమంత్రి దీపం వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గణేష్, ఆంజని రెడ్డి, సుధీర్ రెడ్డి, గజ్వేల్ భరత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## ముత్యాలమ్మ జాతర 'మాన్ ఊరేగింపు'లో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు

**దామరచర్ల, (నేటి ఫోకస్‌న్యూస్)-మే 23:** దామరచర్ల మండల కేంద్రంలో ఈ రోజు జరిగిన ముత్యాలమ్మ జాతరలో మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన మాన్ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట జెడ్.పి.టి.సి అంగోతు లలిత హతిరం, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కుందూరు వీర కోటి రెడ్డి, పడిగాపాటి పెదకోటి రెడ్డి, ఎం.పి.టి.సిలు సోముసైదిరెడ్డి, బాల లక్ష్మీ సత్యానారాయణ, కో-ఆప్షన్ సభ్యులు నాగుల్ మీరా, మాజీ సర్పంచ్ గుగులోతు వీర బాబు, కానసాని సోమయ్య, ఉపసర్పంచ్ సోమయ్య, నాయకులు కందుల నాగిరెడ్డి, పడిగాపాటి శ్రీనివాస్ రెడ్డి, కొండారపు బ్రదర్స్, నీరుకంటి శ్రీనివాస్, రఫీ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం

**తొర్రూర్ (నేటి ఫోకస్ న్యూస్)మే 23:** వరంగల్ ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కి మద్దతుగా వారి సతీమణి లక్ష్మీ ప్రేమేందర్ రెడ్డి గురువారం పట్టణ కేంద్రంలోని స్థానిక యతి రాజారావు పార్క్, హైస్కూల్, అన్నారం రోడ్డు సర్విసగర్‌లో మార్నింగ్ వాకర్స్ ను కలిసి బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నలభై ఏళ్లుగా నమ్మిన సిద్ధాంతం కోసం నిస్వార్థంగా పనిచేస్తూ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి కొట్లాడే ప్రశ్నించే గొంతుక అయిన గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే మండలిలో ప్రజా సమస్యలను, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి వాటి పరిష్కారానికి ఊతమిచ్చే అవకాశం ఉంటుంది అని తెలిపారు. ఊసరవెళ్ళి రంగుల మార్చినట్లు పూటకో పార్టీ మారే కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తే తమ స్వార్థం కోసం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ప్రభుత్వానికి బానిసలు గా మారుతారె తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదని చేసేదేమీ లేదని ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ కి సన్నిహితుడైన ప్రేమేందర్ రెడ్డి గెలిస్తే మోడీ సహకారంతో తెలంగాణ సమగ్రాభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందని, నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తారనే విషయాన్ని పట్టభద్రులు, మేధావులు , ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు విచక్షణతో ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి గార్లపాటి మంజూల రెడ్డి,నూకల ఉషారెడ్డి, బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ , తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ సుంకరనేని కోటేశ్వర్, జిల్లా, మండల నాయకులు సాయిని ఝాన్సీ, బొచ్చు సురేష్, వడ్లకొండ రవి, పైండ్ల రాజేష్, గట్ల భరత్, కాగు నవీన్, జలగం రవి, గంధం రాజు, కుమ్మరికుంట్ల శివ, సాయిని రవి,అమల, నాగేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బందికి సన్మానం చేసిన క్లాస్మేట్ క్లబ్

**అచ్చంపేట, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి)-ఆర్.భరత్ మే 23:** పదర మండలంలోని ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది యొక్క సేవలు మరువలేనని వారి సేవలను గుర్తించిన క్లాస్మేట్ క్లబ్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కామ్ శెట్టి శ్రీనివాసులు గుప్తా అశోక్ గుప్తా శాలువాలతో ఘనంగా సన్మానించారు.వైద్య సిబ్బందికి భోజనం ఏర్పాట్లు చేసి అందరితో కలిసి భోజనాలు చేయడం జరిగినది అదేవిధంగా కరోనా సమయంలో కూడా వారి ప్రాణాలను లెక్కచేయకుండా సేవలందించినందుకు క్లాస్ మెంట్ క్లబ్ వారికి అభినందనలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ సంబు వెంకటరమణ మరియు మహాసభ రీజనల్ చైర్మన్ ఏలూరు సత్యనారాయణ హాజరయ్యారు వారు మాట్లాడుతూ ప్రాణం పోసి వాడు భగవంతుడు అయితే ఆ ప్రాణాన్ని భద్రంగా కాపాడే వాళ్ళు వైద్య సిబ్బంది అని నల్లమల ప్రాంతంలో ఉన్న గిరిజన హరిజన ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ఈ ప్రాంత ప్రజలకు తీసుకున్న సేవలకు అందరికీ శాలువాలతో సన్మానించారు.





## మంత్రి కోమటిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాచారం కాంగ్రెస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్..

**నేటి ఫోకస్ న్యూస్, నాచారం:**

రోడ్లు భవనాల శాఖ సినిమా ట్రోఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జన్మదినం సందర్భంగా నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డిని శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఉమామహేశ్వర ఘాటు రోడ్డులో భక్తుల ఆటో బోల్తా

**అచ్చంపేట (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి) ఆర్.భరత్-మే 23:**

అచ్చంపేట నియోజకవర్గం పులిజాల మరియు తాండూరు గ్రామానికి చెందిన భక్తులు గురువారం రోజున శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర దేవస్థానానికి దర్శించుకుని తిరిగి వ్రాయాణంలో వారు ప్రయాణిస్తున్న ఆటో ఉమామహేశ్వర కాటురోడ్డులో బోల్తా పడటం జరిగినది అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్ప గాయాలు కావడంతో ఆలయ చైర్మన్ కందూరి సుధాకర్ 108 కి ఫోన్ చేసి వారి ఆలయ సిబ్బంది సహకారముతో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగినది.








# బీఆర్ఎస్ కార్యకర్తలకు బీమా ధీమా

## మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు

**మిర్యాలగూడ, (నేటి ఫోకస్‌న్యూస్)-మే 23:** బి.ఆర్.ఎస్ పార్టీ తమ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు భరోసా ఇచ్చారు. మిర్యాలగూడ మండలంలోని జాలుబాయి తండాకు చెందిన బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్త జర్పుల లింగు విద్యుదాఘాతంతో మృతి చెందారు. గతంలో క్రియాశీలక సభ్యత్వాన్ని పొందిన లింగు కుటుంబానికి బి.ఆర్.ఎస్ పార్టీ బాసటగా నిలిచింది. గురువారం రెడ్డి కాలనీలోని బి.ఆర్.ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో బి.ఆర్.ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి అందిన రూ. 2లక్షల బీమా చెక్కును నామినీకి భాస్కర్ రావు అందజేశారు. ఉద్యమ పార్టీ నుంచి ప్రస్థానం ప్రారంభించి రాజకీయ పార్టీగా మారిన బి.ఆర్.ఎస్ పార్టీ తమ కార్యకర్తలందరికీ అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. బి.ఆర్.ఎస్ చీఫ్ కే.సీ.ఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించిందని అన్నారు. బి.ఆర్.ఎస్ పార్టీలో రూ.100 చెల్లించి క్రియాశీలక సభ్యత్వం పొందిన కార్యకర్తలెవరైనా ప్రమాదవశాత్తు మృతిచెందినట్లైతే నామినికీ రూ. 2లక్షల బీమా చెక్కును అందజేస్తామని భాస్కర్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో టీ.ఎస్ ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహా రెడ్డి, టీ.ఎస్ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్ సాగర్, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఏ.ఎం.సీ మాజీ చైర్మన్ చిట్టిబాబు నాయక్, అన్నభీమోజు నాగార్జున చారి, పాక్స్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, జర్పుల సేవా నాయక్, సైదా నాయక్, పల్లపు రామస్వామి, గుండెబోయిన చందు యాదవ్, కుంచం రాజ్ కుమార్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువులను పునర్నిర్మిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులను కబలిస్తుంది

## రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి



**మిర్యాలగూడ (నేటి ఫోకస్ న్యూస్) మే 23:** మిషన్ కాకతీయ పథకం ద్వారా బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ఆనాటి సీ.ఎం కే.సీ.ఆర్ తెలంగాణలో ఉన్న చెరువులు అన్నిటిని పునర్ నిర్మించి చెరువులను బలోపేతం చేశారని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెరువులో మట్టిని ఇష్టారాజ్యంగా ప్రభుత్వ అనుమతులు లేకుండానే కబళిస్తున్నారని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు చింతా రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం బి.ఆర్.ఎస్ పార్టీ మిర్యాలగూడ మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్ తో కలిసి పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో యాద్గార్పల్లి, పందిళ్ళపల్లి చెరువు, రుద్రారం చెరువు, వెంకటాద్రిపాలెం చెరువుల్లో వేలాది ట్రాక్టర్లు టిప్పర్ల ద్వారా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారని అన్నారు. చెరువు మట్టి ఎంతో శ్రేష్టమైనదని దీనిని రైతులు తరలించుకునే విధంగా ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు కృషి చేయాల్సి ఉండగా కమర్షియల్ అవసరాలకు, ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గానికి చెందిన ఒక ప్రధాన నాయకుడు కనుసన్నల్లో ఈ అక్రమ దందా యదేచ్ఛగా కొనసాగుతుందని తెలిపారు. పగలు రాత్రి జె.సి.బి ల ద్వారా టిప్పర్లలో మట్టిని తరలించకపోతున్నారని వివరించారు. మైనింగ్ డిపార్ట్మెంట్ నుంచి కొద్దిగా అనుమతి తీసుకుని తీసుకున్న అనుమతులకు మించి త్రవ్వకాలు జరుపుతూ కొంతమంది కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు అక్రమ ఆర్జనలకు తెరలేపారని ఆరోపించారు. రైతుల నోట్లో మట్టి కొట్టి కమర్షియల్ అవసరాలకు చెరువు వంద్రు మట్టిని తరలించడం ఏంటని ప్రశ్నించారు. చెరువుల్లో ఇష్ట రాజ్యంగా త్రవ్వకాలు జరపడం వలన ముమ్ముందు చెరువులు నిండిన తర్వాత ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని ఇటువంటి గుంతలు త్రవ్వడం వలన దామరచర్ల లోని ఒక చెరువులో ఇద్దరు చిన్నారులు చనిపోయారని తెలిపారు. ఒకవైపు చెరువుల్లో అక్రమంగా మట్టి త్రవ్వకం జరుగుతుండగా మరొకవైపు చెరువు శిఖం భూములను ఆక్రమిస్తున్నారని దీనివలన చెరువు విస్తీర్ణం తగ్గిపోయి ముమ్ముందు చెరువుల్లో నీటి స్టోరేజీ తగ్గిపోయి భూగర్భ జలాలు తగ్గిపోతాయని దీని వలన రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. టి.ఆర్.ఎస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో ఉన్న చెరువులు అన్నిటిని అద్భుతంగా పునర్నిర్మానం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇష్టారాజ్యంగా చెరువులను కబళించి మట్టిని కమర్షియల్ అవసరాలకు తరలిస్తూ అక్రమ ఆర్జనకు కాంగ్రెస్ నాయకులు తెరలేపారని ఆరోపించారు. ఇప్పటికైనా నియోజకవర్గానికి చెందిన ప్రధాన నాయకుడు ఈ అక్రమ దందాకు చెక్ పెట్టాలని లేనట్లయితే బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. చెరువులో మట్టి త్రవ్వకాలు అక్రమ దందా పైన జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీలకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. అదేవిధంగా మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో ఇసుక మాఫియా కొనసాగుతుందని ఇది కొంతమంది నాయకుల కనుసన్నల్లో యదేచ్ఛగా కొనసాగుతుందని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న రెవెన్యూ పోలీసు అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ అక్రమ దందాపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# నివేదిత గెలవాలని దర్గాలను దర్శించుకున్న బిఆర్ఎస్ నేతలు

## సాయన్న చేసిన సేవలు, బిఆర్ఎస్ సంక్షేమ పథకాలే నివేదితను గెలిపిస్తాయి



**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత సాయన్న భారీ మెజారిటీతో గెలవాలని, నాంపల్లి దర్గా, యూసుఫ్ బాబా, మరియు షరీఫ్ బాబా దర్గాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.ఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా టి.ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ... సాయన్న చేసిన సేవలు, బిఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలే మరోసారి నివేదితను ప్రజలు గెలిపిస్తారని ది మా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు దేవులపల్లి శ్రీనివాస్ మైనార్టీ నాయకులు అబ్దుల్ వహాబ్, అజ్జు బాయ్, ఫసి, మహమ్మద్ ది నజీర్, తదితరులు వివిధ దర్గాలను వివిధ దర్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



# దేవర ఫియర్ సాంగ్‌కు 50 మిలియన్లకు పైగా వ్యూస్..




**జూనియర్ ఎన్టీఆర్** టైటిల్ రోల్‌లో నటిస్తున్న ప్రాజెక్ట్ దేవర చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. పాన్ ఇండియా స్థాయిలో వస్తోన్న ఈ మూవీ రెండు భాగాలుగా విడుదల కానుండగా.. దేవర పార్టు 1 అక్టోబర్ 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా దేవర నుంచి ఇటీవలే ఫియర్ సాంగ్‌ను లాంఛ్ చేశారు. అనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేసిన ఈ పాట నెట్టింట గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఫియర్ సాంగ్ యూట్యూబ్‌లో ఇప్పటిరకు 50 మిలియన్లకు పైగా వ్యూస్‌తో టాప్ వన్ ప్లేస్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఫిషింగ్ హార్బర్ విలేజ్, పోర్ట్ మాఫియా నేపథ్యంలో వస్తోన్న దేవర గ్లింప్స్ ఇప్పటికే నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ భామకు దేవర తెలుగు డెబ్యూ ప్రాజెక్ట్. దేవర పార్టు 1 డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. కాగా మేకర్స్ చాలా రోజుల క్రితం లాంఛ్ చేసిన దేవర ఒరిజినల్ సౌండ్ ట్రాక్ స్టన్నింగ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో సెగలు పుట్టిస్తోంది. దేవరలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటిస్తుండగా.. ప్రకాశ్ రాజ్, ÷న్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ ఇతర కీ రోల్స్ పోషిస్తున్నారు. మల్టీ లింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.




# బుజ్జితో ప్రయాణం ఎంతో ఆసక్తికరం..

## అమితాబ్, కమల్ సర్‌తో నటించడం అదృష్టం

**బుజ్జితో కలిసి భైరవ చేసిన** ప్రయాణం ఎంతో ఆసక్తికరం. ఈ పాత్రలతో మూడేళ్ల ప్రయాణం చేశా' అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'కల్కి 2898 ఎ.డి'. దీపికా పదుకొణె కథానాయిక. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మించారు. జూన్ 27న సినిమాని విడుదల చేస్తున్నారు. పురాణాలతో ముడిపడిన సైన్స్ ఫిక్షన్ చిత్రమిది. ఇందులో భైరవ అనే పాత్రలో కనిపిస్తారు ప్రభాస్. బుజ్జి అనే పేరుతో కూడిన వాహనం కూడా కథలో కీలకం. బుజ్జి, భైరవ పాత్రల్ని పరిచయం చేస్తూ బుధవారం రాత్రి రామోజీ ఫిల్మ్‌సిటీలో ఓ వేడుకని నిర్వహించారు. బుజ్జి వాహనాన్ని నడుపుకుంటూ వేదిక మధ్యలోకి వచ్చి అభిమానుల్ని అలరించారు ప్రభాస్. ఇదే వేడుకలో 'బుజ్జి-భైరవ' టీజర్‌నీ ప్రదర్శించారు. 'ఇంక తిరిగి వెళ్లేదే లేదు...' అంటూ ప్రభాస్ చేసిన సందడి టీజర్‌కి ఆకర్షణగా నిలిచింది. అనంతరం వేడుకలో ప్రభాస్ మాట్లాడుతూ 'అమితాబ్... కమల్ హాసన్ నటనని చూసి భారతదేశం స్ఫూర్తి పొందింది. అలాంటి గొప్ప నటులతో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం. అమితాబ్ బచ్చన్‌లాంటి నటుడు మన దేశంలో ఉన్నందుకు గర్వపడుతున్నా. ఆయన స్ఫూర్తితోనే వచ్చాం మేమంతా. నా చిన్నప్పుడు కమల్‌హాసన్ సర్ నటించిన 'సాగరసంగమం' చూసి అలాంటి దుస్తులు కావాలని మా అమ్మని అడిగి తెప్పించుకున్నా. ఇందులో ఉన్న మరో అందమైన స్టార్ దీపికా పదుకొణె. ఆమెతో కలిసి పనిచేయడం మంచి అనుభవం. దిశా పటానీని హాట్ స్టార్ అంటుంటారు మా నిర్మాత స్వప్నదత్. నిర్మాత అశ్వనీదత్ ఈ వయసులోనూ శ్రమించే విధానం చూసి ఎంతో నేర్చుకోవాలనిపిస్తుంది. ఇంత




ఖరీదైన సినిమా తీస్తూ కూడా, ఇంకా ఏం చేద్దాం అని అడుగుతుంటారు. ఇంత భారీ సినిమాలు తీస్తూ, ఇన్నేళ్లు పరిశ్రమలో ఉన్నది ఆయనొక్కరేనేమో. తన రెండో సినిమానే ఎన్టీఆర్‌తో చేశారంటే ఆయన స్థాయి ఏమిటో అర్థమవుతుంది. అంతే ధైర్యం, తపనతో పనిచేస్తుంటారు ఆయన కుమార్తెలు స్వప్న, ప్రియాంక. వాళ్లకీ, బుజ్జిని పరిచయం చేస్తున్న దర్శకుడు నాగ్ అశ్విన్‌కి కృతజ్ఞతలు. ఈ సినిమా కోసం నేనూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా అన్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'పేరు చిన్నదే కానీ, సినిమాలో బుజ్జి మామూలుగా ఉండదు. సినిమా తీయడమే కష్టం, ఈ సినిమా కోసం ఇంజినీరింగ్ కూడా చేయాల్సి వచ్చింది. భవిష్యత్తు కారు నేపథ్యంలో సినిమా అన్నప్పుడు డిజైన్ గురించి తర్జన భర్జన పడ్డాం. మహీంద్ర గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాకు ట్వీట్ చేశాక, ఆయన తన బృందాన్ని మాకు పరిచయం చేశారు. వాళ్లంతా చాలా సహకారం అందించారన్నారు. నిర్మాత సి.అశ్వనీదత్ మాట్లాడుతూ 'ఇది విడుదల తర్వాత చాలా పెద్ద సినిమా అవుతుందన్నారు.




# లవ్ మి సినిమాతో వస్తున్న వైష్ణవి చైతన్య..

**ఈమధ్య కాలంలో ఒక** తెలుగమ్మాయికి మంచి పేరు వచ్చిందంటే ఆ అమ్మాయి ఒక్క వైష్ణవి చైతన్య అనే చెప్పాలి. 'అల వైకుంఠ పురంలో' అల్లు అర్జున్‌కి చెల్లెలుగా నటించి 'వాళ్ళు నా చున్నీ ఎత్తుకెళ్లి పోయారురా' అంటూ అల్లు అర్జున్‌తో అన్న ఆ సన్నివేశం అందరికీ గుర్తుంది. అదే వైష్ణవి చైతన్య గురించి అదే అల్లు అర్జున్ 'బేబీ' సినిమా విజయోత్సవ సభలో ఎంత గొప్పగా చెప్పారో కూడా అందరికీ తెలిసిన విషయమే. వైష్ణవి చైతన్య 'బేబీ' అనే సినిమాతో తెలుగు పరిశ్రమలో ఒక ప్రకంపనలు సృష్టించింది. ఎక్కడినుండో వచ్చి తెలుగు రాని కథానాయికలు ఏలుతున్న ఈ సమయంలో అవకాశం ఇస్తే తెలుగు అమ్మాయి ఎంత చక్కటి ప్రతిభను కనబరుస్తుందో చేసి చూపించింది వైష్ణవి. 'బేబీ' సినిమాతో విమర్శకుల ప్రశంసలే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో యువతని కూడా ఇట్టే ఆకర్షించిన నటి వైష్ణవి చైతన్య. ఇప్పుడు 'లవ్ మీ' సినిమాకి ప్రత్యేక ఆకర్షణ వైష్ణవి చైతన్య అని మాత్రమే చెప్పాలి అని అంటున్నారు. 'మే 25న విడుదలవబోతున్న 'లవ్ మీ' సినిమాలో అందరి దృష్టి ఇప్పుడు వైష్ణవిపైనే ఉన్నాయని తెలుస్తోంది. 'బేబీ' సినిమాతో ఒక సంచలనం సృష్టించిన వైష్ణవి, 'లవ్ మీ' లో ఎలాంటి పాత్ర చేస్తోంది, ఆమె ప్రతిభని తెలుగు ప్రేక్షకులకి మరోసారి చూపించే దిశగా ఆ పాత్ర ఉంటుందా అనే ఆసక్తితో ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో కథానాయకురాలిగా నటించటంతో పాటు, ఒక పాట కూడా పాడింది వైష్ణవి. లెజెండరీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి ఈ సినిమాకి సంగీతం సమకూరిస్తే, ఆయన సంగీత దర్శకత్వంలో వైష్ణవి పాట పాడటం ఇంకొక ఆసక్తికరమైన విషయం. ఈ సినిమాకి దర్శకుడు అరుణ్ భీమవరపు, ఛాయాగ్రహణం దేశంలో అత్యంత ప్రతిభావంతుడైన పీసీ శ్రీరామ్. ఇంతమంది పెద్ద పెద్ద సాంకేతిక నిపుణలతో పనిచేసే అవకాశం తన కెరీర్ ఆరంభంలోనే వైష్ణవికి రావటం నిజంగా ఆమె ప్రతిభకి తార్కాణం. ఆశిష్ రెడ్డి ఈ సినిమాలో కథానాయకుడు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఈ సినిమాని నిర్మిస్తున్నారు.




## కాజల్ సత్యభామ సినిమా జూన్ 7కు వాయిదా

మే 31న సుమారు అరడజనుకు పైగా సినిమాలు విడుదలవుతాయయనుకుంటున్న సమయంలో అందులో ఒక్కో సినిమా వాయిదా పడుతూ వస్తోంది. సుధీర్ బాబు నటించిన 'హరోం హర' మే 31న విడుదల కావాల్సి వుంది, కానీ ఇప్పుడు ఆ సినిమా జూన్ 14న విడుదలవుతుంది. ఇప్పుడు ఇంకో సినిమా కూడా విడుదల వాయిదా వేశారు. కాజల్ అగర్వాల్ పోలీసు పాత్రలో నటించిన 'సత్యభామ' సినిమా కూడా వి డుదల వాయిదా పడింది. కొత్త విడుదల తేదీ జూన్ 7 అని అధికారికంగా ప్రక టించారు. మే 31న ఎక్కువ సినిమాలు విడుదలకి ఉండటంతో, అందరితోపాటుగా ఎందుకు పోటీ అని జూన్ 7 కి ఈ 'సత్యభామ' ని వాయిదా వేసినట్టు తెలుస్తోంది. అయితే ఈ సినిమా ప్రీ విడుదల వేడుక మాత్రం యధావిధిగా జరుగుతుందని చెపుతున్నారు. నందమూరి బాలకృష్ణ ప్రత్యేక అతిథిగా వచ్చి ఈ సినిమా ప్రీ విడుదల వేడుకలో పాల్గొంటారని చెప్పారు. 'భగవంత్ కేసరి' సినిమా విజయం తరువాత కాజల్ అగర్వాల్ చేస్తున్న సినిమా ఈ 'సత్యభామ'. సుమన్ చిక్కాల దర్శకుడు, నవీన్ చంద్ర ఒక ముఖ్యమైన పాత్రలో కనపడనున్నాడని తెలుస్తోంది. కాజల్ అగర్వాల్ ఇందులో ఒక పవర్ ఫుల్ పోలీసు పాత్రలో నటించింది. ఈ చిత్ర ప్రచారాలు విరివిగానే చేస్తున్నారు, కాజల్ ఈ సినిమాని తన వ్యక్తిగతంగా తీసుకొని మరీ ప్రచారాలు చేస్తున్నట్టుగా వినికిడి. 'మేజర్' లాంటి అద్భుతమైన సినిమాకి దర్శకత్వం వహించిన, శశికిరణ్ తిక్క ఈ సినిమాకి సమర్పకుడు, అలాగే కథనం కూడా అందిస్తున్నారు.

## ఓటిటిలోకి విశాల్ రత్నం మూవీ

**తమిళ నటుడు విశాల్ చాలా** రోజులు తర్వాత 'రత్నం' అంటూ ఊరమాస్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. సింగం చిత్రాల ఫేమ్ హరి ఈ సినిమాకు దర్శకత్వం వహించగా ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటించింది. ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో వరల్డ్ వైడ్‌గా ఏప్రిల్ 26న విడుదల చేయగా.. బాక్సాఫీస్ వద్ద మోస్తరు విజయం అందుకుంది. అయితే ఈ చిత్రం విడుదలై నెల రోజులు కూడా కాకముందే ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో ఈ సినిమా ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు బోర్డర్ బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా స్టోరీ ఉండగా.. సముద్రఖని, యోగిబాబు, గౌతమ్ వాసుదేవ్ మీనన్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి నేషనల్ అవార్డు విన్నర్ దేవిశ్రీప్రసాద్

